# ఎల్కతుర్తిలో గులాబీ పండుగ

## : ఘనంగా పార్టీ ఆవిర్భావ వేడుకలు

**ఎల్కతుర్తి/ఏప్రిల్ 27(జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో బీఆర్ఎస్ (టిఆర్ఎస్) పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం మిన్నంటాయి. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పిట్టల మహేందర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాలను ఆవిష్కరించి, కేకులు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గత ఏడాది మండల కేంద్రంలో అట్టహాసంగా జరిగిన బహిరంగ సభ మధుర స్మృతులను నాయకులు గుర్తు చేసుకున్నారు. నాటి సభకు పది జిల్లాల నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు, వేలాదిగా కార్యకర్తలు తరలివచ్చి దిగ్విజయం చేసిన తీరును వారు నెమరువేసుకున్నారు.



యూత్ నాయకుడు ఈర కమలాకర్ మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భావ వేడుకలు ప్రతి కార్యకర్తలో కొత్త ఉత్సాహాన్ని నింపాయని, మండల కేంద్రంలో జరిగిన సభ ఒక చారిత్రాత్మక ఘట్టమని కొనియాడారు. కేసీఆర్ ప్రసంగాలు, పార్టీ సిద్ధాంతాలు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో ప్రతి ఒక్కరూ కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిట్టల మహేందర్ తో పాటు సీనియర్ నాయకులు గొల్ల మహేందర్, మాజీ ఎంపీపీ స్వప్న, వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, వై. స్వామి, రవీందర్ గౌడ్, బొంకూరి రజిత పాల్గొన్నారు.

అలాగే యూత్ నాయకులు మైపాల్ రెడ్డి, చెవుల కొమురయ్య, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కడారి రాజు, చిట్టి గౌడ్, ప్రహ్లాద రావు తదితరులు పాల్గొని పార్టీ బలోపేతానికి ప్రతిజ్ఞ చేశారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో మండల కేంద్రం గులాబీమయంగా మారింది. గత జ్ఞాపకాలను పంచుకుంటూ, రాబోయే రోజుల్లో పార్టీని మరింత పటిష్టం చేస్తామని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.



టి అర్ ఎస్ యూత్ నాయకులు ఈర కమలాకర్

# రేపటి నుంచే ఉచిత కరాటే శిక్షణ

## సత్తుపల్లి వాసులకు సదవకాశం





**సత్తుపల్లి/ఏప్రిల్ 27 (జర్నలిస్ట్ వార్త);**
వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఆత్మరక్షణ విద్యపై అవగాహన కల్పించేందుకు లయన్ బుడోకాన్ కరాటే హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. మే 1వ తేదీ నుంచి స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఈ శిబిరం ప్రారంభం కానుంది. కరాటే అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, ప్రముఖ శిక్షకులు వి. పిచ్చయ్య ఆధ్వర్యంలో మే 31 వరకు ఈ శిక్షణ కొనసాగుతుంది. ప్రతిరోజూ ఉదయం 5:30 నుంచి 7:00 గంటల వరకు విద్యార్థులకు మెలకువలు నేర్పించనున్నారు.గత కొన్నేళ్లుగా ప్రతి వేసవిలో పిచ్చయ్య ఉచితంగా శిక్షణ ఇవ్వడం విశేషం. శిక్షణలో భాగంగా క్రమం తప్పకుండా హాజరయ్యే విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు, నెల రోజుల కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గల బాలబాలికలు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు 9441201769 నంబరులో సంప్రదించాలని కోరారు. సత్తుపల్లి ప్రాంత విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఎస్సై నర్సింహారావును కలిసిన బీఆర్ఎస్ నాయకులు

**ఎల్కతుర్తి/ఏప్రిల్ 27(జర్నలిస్ట్ వార్త):**
మండల పోలీస్ స్టేషన్ ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన నర్సింహారావును సోమవారం బీఆర్ఎస్ నాయకుడు ఈర కమలాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండలంలోని ప్రస్తుత పరిస్థితులు, నెలకొన్న పలు సమస్యలను ఎస్సై దృష్టికి తీసుకెళ్లారు.గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్సై ప్రవీణ్ కుమార్ ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో ప్రజల మన్ననలు పొందారని, చిన్నపాటి తగాదాలు, భూ వివాదాలను ఇరువర్గాలకు సర్దిచెప్పి సామరస్యంగా పరిష్కరించేవారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో నూతన ఎస్సై కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ, శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలని కోరారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే సామాన్య ప్రజలకు తగిన గౌరవం దక్కేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# డిజిటల్ జనగణనలో భాగస్వాములు కావాలి

## : మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి




**నర్సంపేట/ఏప్రిల్ 27(జర్నలిస్ట్ వార్త):** దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణన 2027‘ డిజిటల్ సర్వేలో పట్టణ ప్రజలందరూ భాగస్వాములు కావాలని నర్సంపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ కోరారు. శనివారం పట్టణంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. ప్రజలు తమ మొబైల్ లేదా కంప్యూటర్ ద్వారా ఆన్‌లైన్‌లో ‘స్వీయ గణన‘ (సెల్ఫ్ ఎన్యూమరేషన్) చేసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియ ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.జనగణనలో వివరాలు నమోదు చేసుకుంటే సంక్షేమ పథకాలు నిలిచిపోతాయనే అపోహలను ఎవరూ నమ్మవద్దని, వాస్తవానికి అర్హులైన వారికి పథకాలు మరింత వేగంగా అందేందుకు ఈ గణాంకాలు దోహదపడతాయని స్పష్టం చేశారు. దేశ భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పనకు జనాభా లెక్కలు కీలకమని, ప్రతి పౌరుడు బాధ్యతగా వివరాలు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్, అదనపు బాధ్యత అధికారి విజేందర్, వార్డు ఆఫీసర్ సుష్మ, జనగణన సర్వే అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.




# బంకుల వద్ద ‘నో స్టాక్’

## బోర్డులు ఇంధనం కోసం వినియోగదారుల బారులు







**సత్తుపల్లి/ఏప్రిల్ 27(జర్నలిస్ట్ వార్త);**నియోజకవర్గ వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రరూపం దాల్చింది. గత రెండు రోజులుగా సత్తుపల్లిలోని మెజారిటీ బంకుల వద్ద ‘నో స్టాక్’ బోర్డులు దర్శనమిస్తుండటంతో వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏదైనా బంకుకు నిల్వలు వచ్చాయని తెలియగానే జనం ఎగబడుతుండటంతో గంటల వ్యవధిలోనే స్టాక్ ఖాళీ అవుతోంది. భవిష్యత్తులో దొరకదన్న భయంతో వినియోగదారులు డ్రమ్ములు, వాటర్ క్యాన్లతో వచ్చి పెద్ద మొత్తంలో ఇంధనాన్ని తీసుకెళ్తున్నారు.

ప్రస్తుతం వరి కోతల సీజన్, శుభకార్యాల సమయం కావడంతో డీజిల్ దొరక్క వ్యవసాయ పనులు నిలిచిపోతున్నాయి. ఎండ తీవ్రతను సైతం లెక్కచేయకుండా గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి సరఫరాను పునరుద్ధరించాలని, అలాగే బంకుల వద్ద ఇంధన విక్రయాలపై పరిమితులు విధించి వాహనాల్లో మాత్రమే నింపేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కృత్రిమ కొరత సృష్టించే వారిపై నిఘా పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.



# గోసంరక్షణకు కఠిన చట్టాలు తేవాలి: తహసీల్దార్‌కు వినతి





**సత్తుపల్లి/ఏప్రిల్ 27(జర్నలిస్ట్ వార్త):** గోవుల సంరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ సత్తుపల్లి గో సంరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా సుమారు వెయ్యి మంది సంతకాలతో కూడిన విజ్ఞప్తిని సమర్పించారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ.. గోవులను అక్రమంగా తరలించే వారిపై, వధించే వారిపై కఠిన చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి మండల కేంద్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో గోశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. ఇదే వినతిపత్రాల ప్రతులను ముఖ్యమంత్రి, గవర్నర్, ప్రధాని మరియు రాష్ట్రపతి కార్యాలయాలకు పంపినట్లు వెల్లడించారు.

గోవు భారతీయ సంస్కృతికి, వ్యవసాయానికి మూలస్తంభమని, గోరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు కోరుకొండ వెంకటేశ్వరరావు, దేవరపల్లి శ్రీనివాస్, గట్టి వాసు, భానోత్ విజయ్, మంద శివ, పాలకొల్లు శ్రీనివాస్, డాక్టర్ పెద్దిరాజు, నాగ మౌనిక, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



# నల్లబెల్లిలో దళిత రత్న గ్రహీతలకు ఘన సన్మానం

**- ఉప్పొంగిన జనవాహిని.. హోరెత్తిన డీజే పాటలు**

**- సామాజిక సేవకు దక్కిన గౌరవం - మంద కుమార్ మాదిగ**



**వర్ధన్నపేట/ఏప్రిల్ 26(జర్నలిస్ట్ వార్త);**
దళితుల సంక్షేమం, సామాజిక అభివృద్ధి కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న వారికి లభించిన గుర్తింపు గ్రామానికే గర్వకారణమని ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ జాతీయ అధికార ప్రతినిధి మంద కుమార్ మాదిగ అన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రవీంద్రభారతిలో అందజేసిన దళిత రత్న అవార్డులను కైవసం చేసుకున్న వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామానికి చెందిన బిర్రు సునీత మహేందర్ మాదిగ, కందికట్ల సృజన విజయ్ మాదిగలకు ఆదివారం గ్రామస్తులు ఆత్మీయ సన్మాన సభను అత్యంత వైభవంగా నిర్వహించారు.

### హోరెత్తిన ఊరేగింపు అంబరాన్నంటిన సంబరాలు

అవార్డు గ్రహీతలకు స్వాగతం పలుకుతూ గ్రామ పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. డీజే శబ్దాలు, డప్పు వాయిద్యాల నడుమ యువత, మహిళలు పెద్ద ఎత్తున నృత్యాలు చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ వద్దకు చేరుకుని బాబాసాహెబ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు అవార్డు గ్రహీతలను గజమాలతో ఘనంగా సన్మానించారు.

### ఉద్యమాల స్ఫూర్తితో ముందుకు..

మంద కుమార్ మాదిగ మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో గత 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణతో పాటు అనేక సామాజిక అంశాలపై నిరంతర పోరాటాలు సాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ, ప్రభుత్వ పథకాలు అట్టడుగు వర్గాలకు అందేలా కృషి చేసినందుకే సునీత, సృజనలకు ఈ గౌరవం దక్కిందని కొనియాడారు. కాకతీయ యూనివర్సిటీ హెచ్ఓడీ డాక్టర్ ప్రొఫెసర్ సంకినేని వెంకట్ మాట్లాడుతూ, సామాజిక బాధ్యతతో పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని ఆకాంక్షించారు.

### సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎంఆర్పీఎస్ పోరాటం . బిర్రు ప్రభాకర్ మాదిగ

ఎంఆర్పీఎస్ అంటే కేవలం ఒక సామాజిక వర్గానికే పరిమితం కాదని, అణగారిన వర్గాల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేసే నిరంతర ఉద్యమ ప్రస్థానమని ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు బిర్రు ప్రభాకర్ మాదిగ స్పష్టం చేశారు. మంద కృష్ణ మాదిగ సారథ్యంలో సామాజిక న్యాయం కోసం ఎంఆర్పీఎస్ అలుపెరగని పోరాటం చేస్తోందని ఆయన కొనియాడారు. కేవలం రిజర్వేషన్ల కోసమే కాకుండా, విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో పేదలకు ఎదురవుతున్న ఇబ్బందులపై గళం విప్పుతున్న ఏకైక శక్తి ఎంఆర్పీఎస్ అని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త సేవా దృక్పథంతో పనిచేస్తూ, సమాజంలోని అసమానతలను తొలగించడానికి నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. భవిష్యత్తులో కూడా ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా ప్రభాకర్ మాదిగ పునరుద్ఘాటించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్, ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకులు పుట్ట రవి మాదిగ, మాస్ రాష్ట్ర అధ్యక్షులు జన్ను రాములు, మార్కెట్ డైరెక్టర్



మల్యాల దేవేందర్, డాక్టర్ పోలిసాని దుర్గారావు, దారా దేవేందర్, ఉపసర్పంచ్ మేకల దేవేందర్ యాదవ్ రాజకీయ పక్షాల ప్రతినిధులు తాటికాయల దిలీప్, జన్నపు రెడ్డి సంపత్ రెడ్డి , తాటికాయల సురేష్ , డోలి సతీష్ , ఆరెల్లి ప్రభాకర్ తో పాటు వివిధ కుల సంఘాల నాయకులు తోపుచర్ల నరసింహారావు, ఎలబోయిన వీరయ్య, బోడపట్ల కొమురయ్య, కొన్నే లింగం, గజ్జల వేణు తదితరులు పాల్గొన్నారు.



